

# బంధం

## శ్రీకళ అబ్బరాజు

*(గతసంచిక తరువాయి)*

**సూట్ కేస్** తీసి మంచం మీద పెట్టి ప్రయాణానికి కావలసినవి ఒక్కొక్కటిగా సర్దుకోవడం మొదలుపెట్టింది సుమ.

"ఏమిటి విశేషం. యివాళ ఉదయాన్నే వచ్చావు?" స్నేహ గొంతు వినిపించింది హాల్లో.

"మిమ్మల్ని చూడాలనే వచ్చాను" జవాబుగా దీప్తి గొంతు. ఇద్దరూ ఒకర్నొకరు పలకరించుకుని, మాట్లాడుకోవడం మొదలు పెట్టారు.

సుధీర్ తండ్రి చనిపోయాడని బంటీని స్కూల్ మధ్యలో సెలవలు పెట్టించి తీసుకొచ్చినందుకు సుధీర్ మీద నేరాలు చెబుతూ కూర్చుంది స్నేహ.

దీప్తి దానికి వత్తాసు పలుకుతూ ఆదిత్య తన విషయంలో ఎంత కేర్‌లెస్‌గా వుంటాడో చెప్పుకొస్తోంది.

"సుమ యింట్లో వుందా?" మధ్యలో ఉన్నట్టుండి దీప్తి అడగడం వినిపించి చేస్తున్న పని ఆపి ఒక క్షణం నిలబడిపోయింది సుమ.

"ఆ గదిలోనే వుంది. ఆవిడతో నీకేం పని?" స్నేహ గొంతు వినిపిస్తుండగానే... ధడాల్న తలుపు తోసుకుని లోపలికి వచ్చింది దీప్తి.

"హలో" సుమ పలకరింపుని కూడా పట్టించుకోలేదు.

"చూడూ! నిన్ను ఆదిత్య యిదివరకు ప్రేమించాడని నాకు తెలుసు. అది వర్కవుట్ కాలేదు. అందులో నాకే ప్రాబ్లం లేదు. నువ్వు మళ్ళీ ఈ యింటికి తిరిగి వచ్చావు. ఎక్స్ గాళ్‌ఫ్రెండ్ పక్కన వుండడం పెట్రోలు పక్కన లైటర్‌లాంటిదే అని తెలిసినా నేను ఏమీ మాట్లాడలేదు. మీ నాన్న కోసం వున్నావని మంచితనంతో ఓర్చుకున్నాను. కానీ మీ నాన్న పోయిన దగ్గర్నుంచి సిట్యుయేషన్ పూర్తిగా మారిపోయింది. పొద్దున్న లేచినప్పటినుంచీ ఆదిత్యకి నీ ధ్యాసే. నువ్వు మంచినీళ్ళు తాగావా? అన్నం తిన్నావా? నిద్రపోయావా? అంటూ నీ ఆలోచనలే. ఈ సింపతీని నీకు అనుకూలంగా మార్చుకుందామన్న ఆలోచన వుంటే దాన్ని ఆపేయ్" అంటూ సుమని దులిపేసింది.

"ఆదిత్య అలా అనుకుంటే దానికి నేనేం చేయాలి?" అంది సుమ కోపంగా.

"ఏమీ తెలియనట్టు అమాయకత్వం నటించకు. నీకు తెలియకుండానే ఫ్రైడేకి డెహ్రాడూన్‌కి ఫ్లైట్ టికెట్ చేయించుకున్నాడా? చేస్తున్నారు కదా అని చుట్టూ కుక్కపిల్లలా తిప్పించుకోకు" ఆవేశంగా అంది.

సుమ ఏం జవాబు చెప్పాలో తెలియనట్టుగా కొయ్యబారిపోయింది.

సుమ వాలకం చూసి దీప్తి కూడా మెత్తబడింది.

"ఇవన్నీ నీకు తెలిసే జరుగుతున్నాయని నేను అనడంలేదు కానీ రెండు నెలల్లో మా పెళ్ళి వుంది. అది గుర్తుంచుకో"

"అయితే? నేను చేసేదేముంది?" మొండిగా అంది సుమ. జరిగిన అవమానానికి ఆమెకి గుండెల్లో మంట రేగినట్టుంది.

"ఆదిత్య ఎలాగూ నా మాట వినడు. అందుకే నీకు చెబుతున్నాను. మా పెళ్ళి సవ్యంగా జరగాలనుకుంటే ఏం చేయాలో అది చేయి చాలు" చెప్పి, తిరిగి హాల్లోకి వెళ్ళిపోయింది.

"మా ఆస్తిలో వాటా కొట్టేసింది. మా మావగారి పుణ్యము అని పెద్ద ఉద్యోగం కూడా సాధించింది. అది చాలదన్నట్టు ఆదిత్యని బుట్టలో వేయడానికి చూస్తున్నట్టుంది. అసలు తండ్రివైపు వాళ్ళు వుట్టి లేకి మనుషులట. వాళ్ళవైపు అతన్నే చేసుకుని విడాకులు కూడా యిస్తుంది. కానీ ఆశలు చూస్తే ఆకాశంలో వుంటాయి. ఆవిడ అనుకోగానే అన్నీ జరుగుతాయా? నువ్వు కంగారుపడకు" దీప్తి వెనకాలే వెళ్ళి నచ్చచెబుతూ వుంది స్నేహ.

ఆవిడ అన్న ఒక్కొక్క మాటకీ సుమకి అవమానంతో గుండె రగిలిపోయింది. ఆవేశంగా జవాబు చెప్పాలని తలుపు తీసుకుని బైటికి వచ్చింది.

అప్పుడే పనిమీద బైటకి వెళ్ళిన ఆదిత్య తిరిగి వస్తూ కనిపించాడు.

సుమని చూస్తూనే "హే! కాకా వాళ్ళబ్బాయిని రమ్మనావుట. అతను వూళ్ళో లేడని చెప్పాడు రామూకాకా! నీకేదైనా పనివుంటే నాకు చెప్పు" అన్నాడు.

"ఇప్పుడేం చెబుతావు?" అన్నట్టు సూటిగా సుమ వైపు చూసింది. దీప్తి.

ఆదిత్య అడిగిన ప్రశ్నకి బదులివ్వకుండానే గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళింది సుమ.

"కాకా! సుమ తెల్లవారుఝామునే డ్రైవర్ని రమ్మని చెప్పిందట. ఎక్కడికి వెళ్ళింది?" రామయ్యని వెతుక్కుంటూ వచ్చి అడిగాడు ఆదిత్య.

రామయ్య ఒక సెకను ఆలోచించి "టైమెంతైంది బిడ్డా?" అడిగాడు.

అడిగిన ప్రశ్నకీ రామయ్య అనేదానికీ సంబధం ఏంటో అర్ధ కాలేదు ఆదిత్యకి. సెల్‌ఫోన్ చూసి "తొమ్మిదిన్నర" అని చెప్పాడు.

"కాకా! నేను నా ఫ్లైట్ టికెట్ రెండురోజుల ముందుకి మార్చించుకున్నాను. తెల్లవారుతూనే నేను బయలుదేరాలి. ఎందుకు అని అడగొద్దు. ఫ్లైటు గాల్లో ఎగిరేవరకు. ఆదిత్యకి ఈ విషయం చెప్పకు" అని సుమ ముందురోజు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి రామయ్యకి.

"నే జెప్ప బిడ్డ. నిన్ను ఈ యింట్ల గెట్ల మాట్లంటున్రో నే విన్న. ఏదన్న ఖరాబ్ అయితే పోగానీ ఇజ్జత్ గిట్ల కాపాడుకోవాలె" అని తను అన్న మాటలు కూడా జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

"సుమమ్మ ట్రైనింగు ముస్సోరినంట. ఆడికి బోయె. నువ్వడిగితే ఈ కవరిట్ల యియ్యమనె" అంటూ లాల్చీ జేబులో నుంచి ఒక తెల్లటి పొడుగాటి కవర్‌ని తీసి ఆదిత్య చేతిలో వుంచాడు.

దాన్ని చూస్తూనే ఆదిత్య కనుబొమ్మల మధ్య గీతలు పడ్డాయి. ఆశాభంగం కలిగించే వాక్యాలేవో అందులో రాసి వుంటాయని అనుమానిస్తూనే లోపల్నుంచి కాగితం తీసి తెరిచి చూశాడు.

డియర్ ఆదీ...

నీకు చెప్పకుండా వెళుతున్నందుకు కోపం వచ్చివుంటుంది. నీకు నా మీద ఉన్న ప్రేమాభిమానాలు నాకు తెలుసు. మనిద్దరి మధ్య వున్న అనుబంధం నిర్వచనానికి అందనిది. చిన్నప్పుడు ఆడుతూ, పాడుతూ గడిపిన క్షణాలు చేసిన ఆకతాయి పనులు, మళ్ళీ మళ్ళీ తలుచుకోవాలనిపించే జ్ఞాపకాలు, అన్నింట్లో నువ్వే వున్నావు. వాటిని దించుకోవాలని ప్రయత్నించేకొద్దీ నా వూపిరిలో భాగమై మనసులోకి లోతుగా దిగిపోతున్నాయి.

అలాంటి నిన్ను లెక్కచేయకుండా వదిలేసి వెళ్ళానని అనుకోవద్దు. ఒకసారి ఆ పొరపాటు చేశాను. రెండోసారి ఎలా చేయగలను? అందుకే ఈ వుత్తరం రాస్తున్నాను.

నువ్వు నా మీద కోపంతో మాట్లాడని రోజు నేనెంత బాధపడ్డానో నీకు తెలియదు. ఇంకెప్పుడూ నిన్ను బాధపెట్టే పని చేయకూడదని ఆ రోజే నిర్ణయించుకున్నాను. కానీ నా అవసరం, నాన్న అనారోగ్యంవల్ల నిన్ను దీప్తికి ఎదురుగా నిలబెట్టవలసి వచ్చింది. నా జీవితంలో వెలుగు నింపడానికే ఈ లోకంలోకి వచ్చాడేమో అనిపించే మా నాన్న నా మిద ఆ మాట కూడా రాకుండా చేశారు. నీకూ, దీప్తికి యిబ్బంది కలిగించకుండా తనే వెళ్ళిపోయారు.

ఆ ఇంటితో నాకున్న అనుబంధాలన్నీ ఆయన కలిపినవే. నీతో సహా. అందుకే ఆ యిల్లు ఆ యింట్లోని వాళ్ళు ఎప్పటికీ నన్ను మంచిగానే గుర్తుచేసుకోవాలని ఒక చిన్న ఆశ.

అందుకే బాగా ఆలోచించి, నాన్న నా పేరుతో రాసిన ఆస్తి తాలూకు కాగితాలు సుధీర్ అన్నయ్య పిల్లల పేరుతో రిజిష్టర్ చేయించాను. ఆ కాగితాలు నా గదిలో స్టడీ టేబుల్ డ్రాలో వుంటాయి.

సుధీర్ అమెరికాకి వెళ్ళిపోతాడు. నేనెలాగూ వుండను. అందువల్ల మీరు వేరే అపార్ట్‌మెంట్‌లోకి మారనవసరం లేదని నా ఊహ.

వీలైతే నాన్నగారి లైబ్రరీని అలాగే వుంచుతావని కోరుకుంటున్నాను. అందులోని ప్రతి పుస్తకంలో, ప్రతి పేజీలో ఆయన ఆత్మ వున్నట్టుంటుంది. అక్కడ కూర్చుంటే నాన్న పక్కనే కూర్చున్నట్టుంటుంది. ఎప్పుడైనా మనసు లాగితే కొద్ది క్షణాలైనా అక్కడ గడపాలని అనుకుంటున్నాను.

నీ పెళ్ళికి నేను రాలేను. అందుకే ముందుగానే నీకు నా శుభాకాంక్షలు. నీకూ ఓ కుటుంబం ఏర్పడి సంతోషంగా వుండాలని నా కోరిక.

దయచేసి నన్ను కలవాలని ప్రయత్నించకు. నా నిర్ణయానికి కారణాలు వెతకాలని చూడకు.

ఆకాశం నుంచి రాలిన వానచినుకులు గచ్చుమీద పడ్డప్పుడు సన్నని తుంపర్లుగా విడిపోతాయి. కిందపడి అస్తిత్వాన్ని కోల్పోయిన నీటి బిందువును మర్చిపోయి తుంపర్లలోని చల్లదనాన్ని మాత్రమే అనుభవిస్తాం. మన మధ్య బంధం కూడా ఆ నీటి బిందువులాంటిదే, దాన్ని మర్చిపోయి దాని తాలూకు తీయటి జ్ఞాపకాల్ని మనసుల్లో దాచుకుందాం.

ఉంటాను నువ్వు ఎప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకునే

**నీ సుమ.**

లెటర్ పూర్తిగా చదువుతూనే ఆదిత్య మొహం వాడిపోయింది. ఆ కవర్లో యింకేదో ఉన్నట్టనిపించి యింకోసారి తెరిచి చూశాడు.

సగానికి అడ్డంగా విరిచివేసిన సిమ్ కార్డు కనిపించిందందులో.

"నాతో మాట్లాడడానికి కూడా యిష్టపడటం లేదన్నమాట" ఆదిత్య మాటలు రానివాడిలా చూస్తూ ఉండిపోయాడు. "ఏమైంది బిడ్డా గట్లయిపోయినవు?" ఆదుర్దాగా అడిగాడు రామయ్య.

"ఎందుకు కాకా సుమకి ఎంత దగ్గరవ్వాలని ప్రయత్నించినా నా నుంచి దూరంగా పారిపోతుంది? ఏం చేస్తే తనకి నచ్చుతాను కాకా? కనీసం మాట్లాడటానికి కూడా యిష్టపడనంత తప్పు నేనేం చేశాను?" రామయ్య భుజాలు పట్టుకుని ఆవేదనగా అన్నాడు.

ఆదిత్య మాటల్ని బట్టి రామయ్యకి విషయం కొంతవరకు అర్థమైనట్టే అనిపించింది.

"సుమమ్మా నువ్వూ నా కళ్ళ ఎదట పెరిగ్గిను. సుమమ్మది తెలిసి ఒకర్ని బాధపెట్టే మనసుగాదు బిడ్డా! గిట్ల జేసిందంటే ఏదో కారణం ఉండాలె" రామయ్య అన్నాడు.

*(ముగింపువచ్చేనెలలో)*

Post your comments